ప్రజాశక్తి
గురువారం 31 ఆగస్టు 2023 5 అనంతపురం





చర్చా కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

కార్పొరేట్ల కొమ్ము కాస్తున్న కేంద్రం



గార్లదిన్నెలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ప్రజాశక్తి గార్లదిన్నె

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి జీపు యాత్రను గార్లదిన్నెలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగం, విద్యుత్తు సమస్యలతో పాటు అధిక ధరలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగాల్ని భర్తీ చేయాలన్నారు. సరసమైన ధరలకే నిత్యవసర వస్తువులు అందించాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మరోసారి కరువు పరిస్థితులు వచ్చాయన్నారు. ఈ సంవత్సరం సకాలంలో వర్షాలు రాకపోవడంతో సుమారు 4 లక్షల ఎకరాల్లో విత్తనాలు వేయలేదన్నారు. వేసిన 5. 62 లక్షల ఎకరాల్లో అత్యధికభాగం పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో వ్యవసాయానికి తొమ్మిది గంటల కరెంటు అమలు చేయాలని, ఎండిపోతున్న పంటలకు నష్టపరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించి. రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు పనులు కోల్పోయినందున ఉపాధి హామీ పథకం కింద అదనంగా వంద రోజుల పని కల్పించాలన్నారు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. 4వ తేదీ తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వీటిలో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా క్యార్యదర్శి వర్గ సభ్యులు ఓ. నల్లప్ప, జిల్లా కమిటీ సభ్యులు రామ సుబ్బారెడ్డి, మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి జీపు యాత్ర పుట్లూరు మండలంలో కొనసాగింది. ఈసందర్భంగా కడవకల్లు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఓ. నల్లప్ప మాట్లాడుతూ వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ ఇవ్వాలని ఎండిపోతున్న పంటలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాలు ఆకాల వర్షాల వల్ల వివిధ రకాల పంటలను కోల్పోయి వేల కోట్ల రూపాయలు రైతులు నష్టపోయారన్నారు. అయితే ప్రభుత్వం కొద్దిమందికి నామమాత్రపు పరిహారం ఇచ్చిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు చట్టాలు మారుస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు, కూలీలను ఆదుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు సమరభేరి నిర్వహిస్తున్నామని 4వ తేదీ తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిసామతనివీటిలో రైతులు, కూలీలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాలరంగయ్య, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు, పుల్లన్న, మండల కార్యదర్శి సూరి, మండల నాయకులు వెంకటచౌదరి, భాస్కర్ రెడ్డి, పెద్దయ్య, పథ్వీ, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

సమరభేరి జీపుజాతాలో సిపిఎం నాయకులు

అనంతపురం : నరేంద్ర మోడీ 2014 సంవత్సరం అధికారంలోకి రాకముందు సంవత్సరానికి రెండు కోట్ల మందికి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఉపన్యాసాలు దంచి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కరికి కూడా ప్రభుత్వ రంగంలో ఉద్యోగ అవకాశాలు లేకుండా చేసారని సిపిఎం ఒకటవ నగర కార్యదర్శి రామిరెడ్డి విమర్శించారు. సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాతూరు ఐదు లైట్ల సర్కిల్, బ్రహ్మంగారి గుడి, మార్కెట్ యార్డ్ దాకా అలాగే తపోవనం సర్కిల్, నారాయణపురంలో నిర్వహించిన సమరభేరి కార్యక్రమంలో రామిరెడ్డి మాట్లాడారు. ధరల పెరుగుదలను అరికట్టడంలో, నిరుద్యోగ సమస్యల పరిష్కరించడంలో, కరెంట్ చార్జీలను తగ్గించడంలోనూ కేంద్ర ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ఎన్నికలు దగ్గరకు వస్తున్నాయని చెప్పి ప్రజల్లో వ్యతిరేకత ఉందని తెలిసి గ్యాస్ ధరను 1170 నుండి 200 రూపాయలు తగ్గించి అది కూడా వారి ఘన కార్యంగా చెప్పుకోవడం బిజెపికి సిగ్గుచేటని విమర్శించారు. నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూస్తుంటే రక్షణ రంగంలో అగ్నిపత్ అనే పేరుతో కాంట్రాక్ట్ విధానాన్ని ప్రవేశపెట్టడం ఈ ప్రభుత్వానికే చెల్లిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన సంస్కరణలను రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తూ విద్యుత్ చార్జీల అమాంతంగా పెంచుకుంటూ పోతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ నాయకులు ప్రకాష్ మసూద్, బాబు, ఎర్రి స్వామి, నాగభూషణం లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, రాజు, గపూర్, జీవ, ఎన్టీఆర్ సీన, తపోవనం రాజు, నవయుగ కాలనీ వన్నూరప్ప ,రవి, నారాయణ, ఫెన్న ఓబులేసు, పీరా, శివ రుద్ర, షరీఫ్, ఆటో విశ్వ తదితరులు పాల్గొన్నారు.



సమరభేరి కార్యక్రమంలో పాల్గొన్న అనంతపురం నగరకమిటీ సభ్యులు, నాయకులు

కరువు నివారణ చర్యలు చేపట్టాలి

'సందర్భం' చర్చలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో ప్రభుత్వం తక్షణం నివారణ చర్యలు చేపట్టాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎన్జీవో హోంలో 'అనంతను వెంటాడుతున్న కరువు' అన్న అంశంపై చర్చ జరిగింది. రిటైర్డు జర్నలిస్టు సుసర్ల రమేష్ ఈ చర్చకు సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, టిడిపి నాయకులు షెక్షావలి, సరిపూటి రమణ, బిజెపి నాయకులు వెంకటేశ్వరరెడ్డిలతోపాటు, రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు సహదేవరెడ్డి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు. రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త సహదేవరెడ్డి మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో కరువులు నిత్యకృత్యమయ్యాయన్నారు. ప్రతి ఐదు సంవత్సరాల కాలంలో రెండు నుంచి మూడు కరువులు ఉంటాయని వివరించారు. అదే విధంగా ప్రధాన పంట అయిన వేరుశనగ మంచి దిగుబడులొచ్చిన సంవత్సరాలు చాలా తక్కువేనని చెప్పారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల విధానంలో మార్పులు తీసుకురావాలని సూచించారు. చిరుధాన్యాల వైపు రైతులు మళ్లితే కొంత ప్రయోజనముంటుందని చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ మట్లాడుతూ వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయన్నారు. దీని వలన వర్షాలు రావడంలోనూ తేడాలుంటున్నాయన్నారు. ఈ ఏడాది వర్షాలొచ్చింది కూడా చూస్తే జులై ఆఖరులో వచ్చిందే ఎక్కువ అన్నారు. ఆగస్టులో మొత్తం వర్షపాతం ఎప్పుడూలేనంత తక్కువగా ఉందన్నారు. ఈ ప్రభావం పంటలపై ఉంటోందన్నారు. వీటిని కూడా పరిగణలోకి తీసుకుని పంటల సాగుపై దృష్టి సారించాల్సిన అవరముందని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పంటలను కాపాడుకునేందుకు రైతులు అనేక రకాల ప్రయత్నాలను సొంతంగా చేసుకుంటున్నారన్నారు. ఉదాహరణకు మన్నీల గ్రామంలో రైతులందరి సహకారంతో మూడున్నర కిలోమీటర్లు పైపులైన్ వేసుకుని పంటను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వాతావరణ పరిస్థితులు ఈ విధంగా ఉంటే ప్రభుత్వం వైఫల్యం మరో సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగానికి విద్యుత్ తొమ్మిది గంటలిస్తామని చెబుతున్నప్పటికీ ఆచరణలో ఆరు గంటలు కూడా రావడం లేదని అన్నారు. దీని వలన కూడా రైతాంగం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణం రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జాపర్ మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై సమిష్టిగా ముందుకు పోవాల్సిన అవసరముందన్నారు. ఉరవకొండ వద్ద 50 వేల ఎకరాలకు సాగునీటిని అందించే ప్రాజెక్టును రాజకీయ కోసమని నిలిపివేయడం శోచనీయమన్నారు. కరువు చర్యలపై సమిష్టిగా కలసి ముందుకుపోవాలని తెలిపారు. బిజెపి నాయకులు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతే జిల్లాలోని కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మొత్తం చర్చల సారాంశాన్ని క్రోడించారు. తక్షణం ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని, నివారణ చర్యలపైనా ఒక లేఖను ప్రభుత్వానికి పంపాలని ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో ఎఎఫ్ ఎకాలజీ ప్రతినిధి వీరభద్రారెడ్డి, రెడ్స్ సంస్థ ప్రతినిధి భానుజా, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా, చంద్రశేఖర్, ఎపి రైతు సంఘం (సిపిఐ) జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎపి పండ్లతోటల సంఘం నాయకులు శివారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ ప్రసూన, ప్రముఖ వ్యాపారవేత్త సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావంగా అభివాదం తెలుపుతున్న నాయకులు

విద్యార్థుల గోడు ప్రభుత్వానికి పట్టదా..?

సైకిల్ యాత్ర ముగింపు సభలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

విద్యార్థుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం ఉదాసీనత ప్రదర్శిస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ విమర్శించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈనెల 23వ తేదీ నుంచి 30 వరకు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్రను నిర్వహించారు. ఈ సైకిల్ యాత్ర ముగింపు సభను అనంతపురం పట్టణంలోని కెఎస్ఆర్ బాలికల పాఠశాలలో బుధవారం నిర్వహించారు ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఏడు రోజులపాటు నిర్వహించిన సైకిల్ యాత్ర సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సంక్షేమ హాస్టల్లో మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు, నాణ్యమైన భోజనం ఇవేవీ లేవని విమర్శించారు. అధ్వాన్న పరిస్థితుల్లో సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుత్తి, ఉరవకొండ, కనేకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం సంక్షేమ హాస్టల్లో మరుగుదొడ్లు లేక ఆరు బయటికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బాలికలు ఉన్న హాస్టల్లో కూడా కనీసం టాయిలెట్లకు తలుపులు లేని దుస్థితి నెలకొందన్నారు. మరోవైపు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు మధ్యాహ్న భోజనం లేక ఆకలితో అలమటిస్తున్నారని అన్నారు. ఈ పథకాన్ని రద్దుచేసిన ప్రభుత్వానికి విద్యార్థుల ఆకలి కేకలు వినపడటం లేదని అన్నారు. విద్యార్థులకు చదువుకోవడానికి పుస్తకాలు ఇవ్వకుండా వారిని విద్యకు దూరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీలలో అధ్యాపక నియామకాలు జరగక పరిశోధనలకు తీవ్రమైన ఆటంకాలు జరుగుతున్నాయని అన్నారు. మరోవైపు ఎయిడెడ్ విద్యాసంస్థలకు నిధులు ఇవ్వకుండా ప్రైవేట్ పరం చేయాలని కుట్రకు ప్రభుత్వం తెరలేపిందన్నారు. కొన్ని మండలాల కేంద్రాలలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు లేక విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకుంటూ తల్లిదండ్రులను అప్పుల పాలు చేస్తూ విద్యను అభ్యసిస్తున్నారన్నారు. అయినా కూడా ఉద్యోగాలు ఇవ్వలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని అన్నారు. 8 రోజుల సుదీర్ఘ సైకిల్ యాత్రలో దాదాపు 400 కిలోమీటర్లు 20 మందితో పర్యటించి విద్యార్థుల సమస్యలను అధ్యయనం చేశామన్నారు. ఎక్కడికెళ్లినా విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు స్పష్టమవుతోందన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని కల్లిబొల్లి కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. ఈ సంక్షేమ హాస్టల్లో అధికారులు గానీ ప్రభుత్వ ప్రజాప్రతినిధులు గాని పర్యటించి హాస్టల్ నిద్ర చేస్తే విద్యార్థుల గోడు అర్థమవుతుందన్నారు. ఏసీల్లో విలాసవంతమైన జీవితాలు గడుపుతున్న వారికి విద్యార్థుల గోడు పట్టడం లేదని విమర్శించారు. ఈ యాత్రలో తమ దృష్టికి వచ్చిన సమస్యలన్నీ నివేదిక రూపంలో కలెక్టర్ అందజేస్తామని ఆ సమస్యల పట్ల అధికారులు స్పందించకుంటే పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. అవసరమైతే కలెక్టరేట్ ముట్టడి, అదేవిధంగా ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ తాడేపల్లిగూడెం గేట్లు బద్దలు కొడతామని విద్యార్థుల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. విద్యారంగంలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని చేతకాకపోతే ప్రభుత్వాన్ని రద్దు చేసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, రాష్ట్ర కమిటీ సభ్యులు వైటిసి రమేష్, రాష్ట్ర గర్ల్స్ కమిటీ సభ్యురాలు రజిత, జిల్లా గర్ల్స్ కన్వీనర్ సునీత, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు తరిమెల గిరి, సిద్ధార్థ, వెంకటేష్, శివ, భీమేష్, మాదేశ్, నరసింహ, నందన్, హరీష్, వివేక్ తదితరులు పాల్గొన్నారు

తాగునీటి పథకం కార్మికుల సమ్మె కొనసాగింపు



అనంతపురంలో అధికారులతో చర్చలు జరుపుతున్న స్ట్రగుల్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - అనంతపురం

సిఐటియు, ఐఎఫ్‌టియు, వైఎస్ఆర్‌టియు కార్మిక సంఘాలతో బుధవారం శ్రీ సత్య సాయి బోర్డు కార్యాలయంలో జరిగిన చర్చలు కార్మికులకు ప్రయోజనకరంగా లేని కారణంగా సమ్మెను కొనసాగించాలని స్ట్రగుల్ కమిటీ నిర్ణయించింది. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ బకాయి వేతనాలు ఇవ్వక, బోనస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ మంజూరు చేయక ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 572 మంది తాగునీటి పథకం కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా చెల్లించడం లేదన్నారు. ఐదుగురు కార్మికులకు 22 సంవత్సరాల నుంచి చెల్లించిన పిఎఫ్ సుమారుగా ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయలు ఎక్కడ వున్నాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఈ విషయంపై అధికారులను అడిగినప్పుడల్లా క్లియర్ చేయిస్తామని చెబుతున్నారేకాని సమస్య పరిష్కరించలేదన్నారు. సమ్మె సమస్యకు పరిష్కారం కాదని ప్రజలకు ఇబ్బంది పెట్టొద్దని కబుర్లు చెప్పే అధికారులు పరోక్షంగా కార్మికులను పస్తులుండాలని చెబుతున్నారని విమర్శించారు. కాంట్రాక్టర్కల ప్రయోజనాలు ఆలోచించడం తప్ప కార్మికుల బాధలను అధికారులు, పాలకులు అర్థం చేసుకోవడం లేదని విమర్శించారు. ఐదు నెలలు వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాల పోషణ ఏ రకంగా ఉంటుందో అధికారులు ఆలోచించాలని స్ట్రగుల్ కమిటీ నాయకులు ప్రశ్నించారు. కార్మికుల హక్కులను అడిగితే నిర్బంధం పాటించడం సరైంది కాదని అన్నారు. నెలల కొద్దీ వేతనాలు ఇవ్వనికాంట్రాక్టర్ల మీద చర్యలు ఎందుకు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. బడ్జెట్ రిలీజ్ అయిందని మొత్తం వేతనాలు అందజేస్తాం మాటలు చెప్పడం తప్ప సమస్యను పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం డిమాండ్లు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగిస్తామని ఈసందర్భంగా స్ట్రగుల్ కమిటీ నాయకులు అధికారులకు చెప్పి సమావేశం నుంచి బయటకు వచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్ర కుమార్, వైయస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులు కెవి. రమణ, ఐఎఫ్‌టియు నాయకులు ఉపేంద్ర కుమార్, మూడు సంఘాల కార్మికుల నాయకులు శ్రీనివాసులు, వన్నూరప్ప, తిరుపాల్ నాయక్, గోవిందు, శంకర్, రాము, మధుసూదన్ రెడ్డి, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రగుల్ కమిటీ నాయకులతో జరిపిన చర్చలు విఫలం

సమస్యలు పరిష్కరించేంతవరకు దశలవారీగా ఆందోళనలు

మడకశిర : తాగునీటి పథకం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేంతవరకు దశలవారిగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు తెలిపారు. శ్రీరామ రెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆర్డబ్ల్యూఎస్, శ్రీరామ రెడ్డి పథకం కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఓబులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు తీరేంతవరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్మికులకు సరిగా వేతనాలు అందించకపోవడంతో పాటు వారికి ఇవ్వాల్సిన ఉపయోగాలు కూడా ఇవ్వకుండా సంబంధిత అధికారులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇలా అయితే కార్మికులు వారి కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తాగునీటి పథకం కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.



మడకశిరలో కార్మికులు నిర్వహిస్తున్న ఆందోళనలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

పంటలు, తాగునీటి పరిస్థితులపై ప్రభుత్వానికి రోజువారీ నివేదికలు

కలెక్టర్ ఎం.గౌతమి



పంటకు నీరందించే విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగుచేసిన వేరుశనగను రైతులు కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. బుధవారం కూడేరు మండలంలో కలెక్టర్ పర్యటించారు. మొదట ముద్దలాపురం గ్రామం వద్ద రైతు నగేష్ పొలంలో సాగుచేసిన బ్యాడిగ చిల్లీ పంటలో ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. రైతు వివరాలు, పంట నమోదు తదితర వివరాలు సక్రమంగా అప్లోడ్ చేశారా లేదా అనిఆరా తీశారు. అనంతపురం నగరానికి తాగునీటిని సరఫరా చేసే డాక్టర్.వైఎస్ రాజశేఖర్ రెడ్డి అనంతపురం మంచినీటి అభివద్ధి పథకాన్ని కలెక్టర్ పరిశీలించారు. అక్కడి నుంచి నగరానికి ప్రతిరోజు 43 ఎంఎల్‌డి నీరు వెళుతోందని, ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న 16 ఎంఎల్డి కెపాసిటీ కలిగిన ఫిల్టర్ హౌస్ నిర్మాణాన్ని రెండు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు. ఆ తరువాత కూడేరు మండలంలోని జల్లిపల్లి గ్రామ పరిధిలో కౌలు రైతు మణెమ్మకు చెందిన ఐదు ఎకరాల పొలంలో కంది పంటకు ట్రాక్టర్ల ద్వారా నీటి సరఫరా విధానాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇలాంటి పద్ధతిని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సూచించారుపంటలు సాగు చేయని పొలాల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకోసం విత్తనాలు ఇచ్చేందుకు ఎలాంటి అవకాశాలు ఉన్నాయి అనేది పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యామ్నాయ ప్రణాళిక కింద చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, కొర్ర, రాగి, తదితర పంటల విత్తనాలను సిద్ధంగా ఉంచామని అన్నారు. ప్రస్తుతం రావలసిన వర్షపాతం కూడా కురువకపోవడంతో విత్తనాలను రైతులు తీసుకోలేదని, పదును వర్షం పడితే విత్తనాలు తీసుకుంటామని రైతులు చెబుతున్నారని తెలిపారు. 2019 నాటి పరిస్థితి ఇప్పుడు కనిపిస్తోందని, జిల్లాలో పంటలకు సంబంధించిన పరిస్థితి ఏ విధంగా ఉంది అనేదానిపై ప్రభుత్వం నుంచి నివేదికలు అడుగుతున్నారని, పంటలు, తాగునీటికి సంబంధించి రోజువారీగా నివేదికలు అందిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. మరో స్పెల్ వర్షపాతం నమోదు కావాల్సి ఉందని, అప్పుడు కూడా వర్షం రాకపోయి ఇలాంటి పరిస్థితి కొనసాగితే నివేదికలను ప్రభుత్వానికి అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, ఏఎఫ్ ఏకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, అగ్రికల్చర్ జెడి ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, ఎపిఎంఐపి పీడీ ఫిరోజ్ ఖాన్, రైతు నేస్తం ఫుడ్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సీఈఓ మురళీకృష్ణ, ఎంపీపీ నారాయణరెడ్డి, తహశీల్దార్ శేషారెడ్డి, ఇక్రిశాట్ ప్రతినిధి రత్నేష్ జైస్వాల్, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనాథ్ రెడ్డి, మున్సిపల్ డీఈ చంద్రశేఖర్, ఏఈ సుబ్బరామయ్య, తాగునీటి అభివద్ధి పథకం ఇన్‌ఛార్జి రాజశేఖర్ రెడ్డి, ఏడీఏ రవి, వ్యవసాయ అధికారి విజయకుమార్, ఎంపిఇఒ నస్రీన్, పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలి



గుంతకల్లులో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం స్థానిక బీరప్ప కూడలిలో సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతున్నాయన్నారు. ముఖ్యంగా పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, ప్రభుత్వ చౌకడిపోల ద్వారా 12 రకాల సరుకులు అందించాలని, వంటగ్యాస్ సిలిండర్ల ధరను 50 శాతం తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి బుధవారం నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకూ సమరభేరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలను చైతన్యం చేసి 4న స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, సాకే నాగరాజు, రామునాయక్, బి.తిమ్మప్ప, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండలంలో జిల్లాలో తీవ్ర వర్షాభావం వల్ల పంటలు ఎండిపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం నుంచి సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆనందరావుపేట, మట్లగొంది గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంట పొలాలను పరిశీలించారు. ఇందులో భాగంగా ఆనందరావుపేటలో రైతు మునీంద్ర సుమారు రూ.1.50లక్షలు ఖర్చు చేసి ఐదెకరాలు, మట్లగొందిలో రైతు ముత్యాలు రూ.2లక్షలు ఖర్చు చేసి ఆరెకరాలు, పెద్దకోనప్ప రూ.2లక్షలు ఖర్చు చేసి 8 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారన్నారు. అయితే ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు పూర్తిగా ఎండుదశకు చేరుకున్నాయన్నారు. వీరితోపాటు అనేకమంది రైతులు పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కావున ప్రభుత్వం స్పందించి వేరుశనగ పత్తి రైతులకు రూ.50వేలు, పంటలు సాగు చేయని రైతులకు రూ.30వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు పెసర, ఉలవ అలసంద, రాగులు, కొర్రలు, జొన్న విత్తనాలను రైతులకు ఉచితంగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి జయరాముడు, శ్రీనివాసులు, ఆంజనేయులు, కుళ్లాయప్ప, నాగేంద్ర, పుల్లన్న, భాస్కర, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇవ్వాలని, ఎండిపోతున్న పంటలకు పరిహారం చెల్లించాలని, ధరలను అదుపు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి యాత్ర బుధవారం నార్పలకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మరోవైపు బోర్ల కింద అయినా పంటలను కాపాడుకోవాలని చూస్తున్న రైతులకు కరెంటు కోతలు శాపంగా మారాయన్నారు. ఒకవైపు బీడు భూములు, మరోవైపు ఎండుతున్న వంటలతో రైతులు తీవ్ర ఆందోళనతో ఉన్నారన్నారు. మరోవైపు కేంద్ర బిజెపి ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు చట్టాలను మారుస్తోందన్నారు. జిల్లాలో సాగు చేసిన పంటలకు ఎకరాకు రూ.50వేలు, పంటలు సాగు చేయని రైతలకు రూ.30వేలు, రైతుల రుణాలు మాఫీ చేయాలని, 400కే గ్యాస్ సిలిండర్‌ను ఇవ్వాలని, 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని, ఎంపిఆర్, పిఎబిఆర్ ద్వారా చెరువులను నీటితో నింపాలని, కూతలేరు బ్రిడ్జిని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, పుల్లన్న, మండల కార్యదర్శి కె.కుళ్లాయప్ప, మండల నాయకులు ప్రభాకర్, రాజా, రామాంజినేయులు, జయరామ్, ప్రసాద్ పాల్గొన్నారు.

సిపిఎం 'సమరభేరి'లో నాయకులు



శింగనమలలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప

నాణ్యమైన విద్యను అందించాలి

జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం



సమావేశంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

అనంతపురం జెఎన్‌టియు పరిధిలోని ప్రతి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపకులపతి జి.రంగజనార్ధన సూచించారు. బుధవారం అనంతపురంలోని జెఎన్‌టియు మెకానికల్ సెమినార్ హాల్ వర్సిటీ అనుబంధ ప్రిన్సిపళ్ల, మేనేజ్‌మెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటెక్ కోర్సు స్ట్రక్చర్ రివిజన్ కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆర్23 రెగ్యులేషన్స్ గురించి చర్చించామని, వీటిలో కొంతమేరకు మార్పులుంటాయని వివరించారు. రెగ్యులేషన్స్‌లో హానర్స్ డిగ్రీ, రెగ్యులర్ డిగ్రీతోపాటు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఈ డిగ్రీని పొందాలంటే అదనంగా 15 క్రెడిట్‌లను సాధించాలని తెలిపారు. వీటితో పాటు ఆడిట్ కోర్సులను కంప్లీట్ చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, డిఎపి వి.సుమలత, యూనివర్సిటీ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప

సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప డిమాండ్ చేశారు. బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పకుండా దానిస్థానంలో జిపిఎస్ విధానాన్ని ఆర్డినెన్స్ రూపంలో తీసుకొస్తామని చెప్పడం బాధాకరమన్నారు. జిపిఎస్ విధానంలో ఎలాంటి మార్పు లేకుండా సిపిఎస్‌లో ఉన్న అంశాలను ఉంచి ఆడినెన్సు రూపంలో తీసుకురావడం చాలా దారుణమన్నారు. ఈ విషయమై మొన్న జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో తెలియజేస్తే బాయ్‌కాట్ చేశామన్నారు. ఉద్యోగుల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు లింగమయ్య, ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, గౌరవాధ్యక్షులు రమణయ్య, ఉపాధ్యక్షులు రామప్పచౌదరి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ దేవేంద్రమ్మ, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

రోడ్డు ప్రమాదాలు, అనారోగ్యం తదితర కారణాలతో జిల్లాలో మృతిచెందిన పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ కె.శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. మృతిచెందిన పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులతో బుధవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి, అంతకు ముందుగానీ కొందరు పోలీసు అధికారులు, సిబ్బంది వివిధ కారణాలతో చనిపోవడం బాధ కలిగించిందన్నారు. ఆయా కుటుంబాలకు అండగా ఉండటమే కాకుండా, జాప్యం లేకుండా ప్రయోజనాలు అందజేస్తున్నామన్నారు. కారుణ్య నియామకాల విషయంలో కూడా నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం దివంగత సీఐ ఆనందరావు, ఏఆర్ కానిస్టేబుల్ భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులకు ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున రెండు లక్షల చెక్కులను అందించారు. అలాగే ఇటీవల మృతిచెందిన బ్రహ్మసముద్రం కానిస్టేబుల్ ఉమేష్ (పీసీ నెంబర్ 3059) కుటుంబానికి విడో ఫ్లాగ్ ఫండ్ కింద రూ.75 వేలు విలువజేసే చెక్కులను ఉమేష్ భార్య వనితకు ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, ఎఆర్ డీఎస్పీ మునిరాజ్, ఆర్ఐ రాముడు, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనా అధికారి శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్, జిల్లా పోలీసు కార్యాలయం సూపరింటెండెంట్లు శ్రీనివాసులు, సావిత్రమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



మృతిచెందిన రమేష్‌గౌడ్

గుత్తి : మండలంలోని వన్నెదొడ్డి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవరు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రమేష్‌గౌడ్ (23) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనేపథ్యంలో రమేష్‌గౌడ్ తన స్నేహితుడు హర్షవర్ధన్‌తో కలిసి ట్రాక్టర్‌లో బండలు వేసుకుని నంద్యాల జిల్లా ప్యాపిలికి వెళ్లి తిరిగి వస్తుండగా వన్నెదొడ్డి గ్రామ సమీపంలోకి రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి డివైడర్ ఢీకొని రహదారి పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. దీంతో రాజేష్‌కు తీవ్రగాయాలు కాగా హర్షవర్ధన్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు రాజేష్‌గౌడ్‌ను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న సిఐ ఎం.వెంకట రామిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలని వినతి

కుందుర్పి : మండలంలోని దళితుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యదర్శి కె.హర్షవర్ధన్‌ను మండల దళిత యువకులు నరసింహమూర్తి, రఘువీరా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ మండలంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లు వేయాలని, భూపంపిణీ చేపట్టాలని కోరారు.

నేడు కౌలురైతులకు రైతు భరోసా పంపిణీ

అనంతపురం : కౌలు రైతులకు మొదటి విడతలో భాగంగా గురువారం రైతుభరోసా పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2,815మంది రైతులకు రూ.1.88 కోట్లు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

జిల్లాకు చేరిన 1728 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం : నర్మదా ఫర్టిలైజర్ కంపెనీకి చెందిన 1728 మెట్రిక్ టన్నుల యూరియా బుధవారం జిల్లాకు వచ్చినట్లు ఏడీఏ రవి తెలిపారు. జిల్లా వచ్చిన ఎరువులు స్థానిక ప్రసన్నాయపల్లి రేక్ పాయింట్ వద్ద పరిశీలించి కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారిణికి నివేదించి నట్లు తెలిపారు.

జిల్లా వైద్యాధికారిణికి అభినందనలు

అనంతపురం : నూతనంగా బాధ్యతు స్వీకరించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి భ్రమరాంబాదేవికి పలువురు అభినందనలు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ నాయకులు బుధవారం కలిసి బోకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పి.శ్రీధర్‌బాబు, కోశాధికారి శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు మస్తాన్, శివకుమార్, ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

బెలుగుప్ప : ఎన్నికల ప్రధాన అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు పకడ్బందీగా ఓటరు జాబితాను తయారు చేయాలని మండల ప్రత్యేకాధికారి జి.శంకరయ్య, తహశీల్దార్ డి.ఓబులేసు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపంలో ఓటరు జాబితాపై బిఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాపై విచారణ చేపట్టాలన్నారు. ఇందులో డబుల్ ఎంట్రీలు ఉంటే సరైన కారణాలను చూపి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహశల్దార్లు జి.మునీంద్ర, పీరాసాబ్, ఆర్ఐ.నగేష్‌బాబు, విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని 74 ఉడేగోళం సమీపంలో ఉన బైపాస్ కూడలి (వైఎస్ఆర్ సర్కిల్)లో వైఎస్ఆర్ విగ్రహం వద్ద ప్రహరీ నిర్మాణానికి విప్ కాపు రామచంద్రారెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ సిఎం జగన్ అభివృద్ధి నిధి నుంచి మంజూరైన రూ.8లక్షలతో వైఎస్ఆర్ విగ్రహం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మాధవరెడ్డి, నాగిరెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

ఉరవకొండ : ప్రజల ఆస్తులకు సంబంధించి యాజమాన్య హక్కు పత్రాలైన డాక్యుమెంట్లు రూపకల్పన విధానాన్ని ఆన్‌లైన్‌లో ప్రభుత్వం తీసుకురావడాన్ని నిరసిస్తూ బుధవారం ఉరవకొండలోని రిజిస్ట్రార్ కార్యాలయం ముందు డాక్యుమెంట్ రైటర్లు, వెండర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్ల యూనియన్ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానానికి నిరసనగా రెండు రోజులపాటు తాము పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లోనే డాక్యుమెంట్‌ను తయారు చేసుకుని చలానా చెల్లించి టైం స్లాబ్ ఏర్పాటు చేసుకుని రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనూ గ్రామ,వార్డు సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. దీనివల్ల సేల్ డీడ్స్ వంటివి జరిగి ఏవైనా లోపాలు చేసుకుంటే ఆస్తులు కలిగిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఆన్‌లైన్ డాక్యుమెంట్ విధానం వల్ల అమ్మకం, కొనుగోలు దారులను మోసం చేసే అవకాశాలు ఎక్కువ ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు, వెండర్లు ఏసీ.ఎర్రిస్వామి, బాలచంద్ర, వెంకటేసులు, అల్లబకాష్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిఆర్ జలాశయం గేట్లకు మరమ్మతులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-గార్లదిన్నె



ఎంపీఆర్ జలాశయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

ఎంపీఆర్ డ్యామ్ గేట్ల మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని ఎంపీఆర్ (మిడ్ పెన్నార్ రిజర్వాయర్) డ్యాంను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఇందులో భాగంగా జలాశయంలో ఎంత నీరు నిల్వ ఉంది.. ఈ సీజన్‌లో ఎంత నీరు వచ్చే అవకాశం ఉంది, ఆయకట్టు ఎంత ఉందనే వివరాలపై ఆరాతీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీఆర్ డ్యాం నుంచి ఎలాంటి లీకేజీలు కాకుండా చూడాలన్నారు. ఈ సంవత్సరం డ్యాం కింద నీటి సరఫరా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, హెచ్ఎల్‌సి ఈఈ వెంకటరమణారెడ్డి, జెఈ సురేంద్రరెడ్డి, తహశీల్దార్ ఉషారాణి, సర్పంచులు ఉషా, బచ్చులన్న, తదితరులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌తోనే మహిళలకు భరోసా : మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్



'ఆహా క్యాంటిన్'ను ప్రారంభించి పరిశీలిస్తున్న మేయర్ వసీం

సిఎం జగన్ రాష్టంలోని మహిళలకు అండగా నిలుస్తున్నారని మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యక్రమం వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటిన్‌ను మేయర్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో మహిళలను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేందుకు మెప్మా కృషి చేస్తోందన్నారు. దీనికి ప్రభుత్వం సైతం అండగా నిలిచి ఆర్థికసాయం అందిస్తోందన్నారు. ఇప్పటికే విజయవంతమైన జగనన్న మహిళా మార్ట్‌లు, అర్బన్ మార్ట్‌ల తరహాలో మహిళలకు ఆహా క్యాంటిన్‌ల ద్వారా మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. అంతే గాకుండా తక్కువ ధరకు రుచి, శుచితో ఆహారం అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొగటం విజయ్‌భాస్కర్‌రెడ్డి, కమిషనర్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, మెప్మా పీడీ విజయలక్ష్మి, టిఎంసి శ్రీనివాస్‌రెడ్డి, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు సుగుణ, శిరీషా, పల్లవి, భువన, వేణుగోపాల్, సత్యమూర్తి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలిచ్చి ఉపాధి కల్పించాలని సిపిఎం నగర న్యూ కమిటీ కార్యదర్శి ఆర్‌వి నాయుడు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, అధిక ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేటి నుంచి నగరంలో సమరభేరి యాత్ర కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు మూర్తుజా, ఇర్ఫాన్, గోపాల్, ఎటిఎం నాగరాజు, కమిటీ సభ్యులు ఓబులేసు, సురేంద్ర, లక్ష్మీనారాయణ, రామాంజనమ్మ, తిరుమలేష్, లతీఫ్, అజామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు, బంకుల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

కక్షపూరితంగా తమ ఇళ్లు, బంకులను తొలగించారని మండల పరిధిలోని ఉద్దేహాల్‌కు చెందిన బాధితులు వాపోయారు. బుధవారం మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో రోడ్డు ఆక్రమించి ఇళ్ల నిర్మాణం, బంకులు వేసుకున్నారని అధికారులు తొలగించారు. సీఐ యుగంధర్, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ శివారెడ్డి, ఇఒఆర్‌డి జయమ్మ ఆధ్వర్యంలో తొలగించేందుకు సిద్ధం కావడంతో స్థానికులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు దాదాపు 100 మంది పోలీసు బందోబస్తుతో జెసిబిల ద్వారా ఏడుగురికి చెందిన గృహాలను తొలగించారు. ఈ సందర్భంగా ఇళ్లు, బంకులను తొలగించి తమ కడుపు కొట్టొదని బాధితులు కురుబ రుద్రన్, సున్నుబట్టి బాషా, దిలీప్, కురుబ నాగప్ప, కురుబ గంగాధర, ఛత్రపతి, ఈడిగ ఎర్రిస్వామి వేడుకున్నా అధికారులు పట్టించుకోలేదు. తొలగిస్తే గ్రామం మొత్త తొలగించాలిగానీ, తమ ఇళ్లు మాత్రమే తొలగించడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.



పోలీసులతో వాగ్వివాదం చేస్తున్న బాధితులు

వంద పడకల ఆసుపత్రిని త్వరగా పూర్తి చేయాలి

తాడిపత్రి : పట్టణంలోని వంద పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణాలను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి అవరణలో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులతోపాటు టిడ్కో గృహ నిర్మాణాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, సంక్షేమానికి సిఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నిరుపేదలకు పక్కా ఇంటిని నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా పక్కా ఇంటితోపాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా గత పాలకుల నిర్లక్ష్యంతో 100 పడకల తాడిపత్రి ఏరియా కలగా మిగిలిపోయిందన్నారు. ప్రస్తుతం సిఎం జగన్ హయాంలో చేపట్టిన నాడు-నేడు కార్యక్రమంతో వంద పడకల ఆసుపత్రిని త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం



ర్యాలీని ప్రారంభిస్తున్న అతిథులు

ఆజాదీ కా అమత మహోత్సవంలో భాగంగా బుధవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల నేషనల్ సర్వీస్ స్కీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కళాశాల వరకూ సాగింది. ఈ సందర్భంగా విసి రంగజనార్ధన మాట్లాడుతూ దేశంలోని ప్రతి పౌరుడూ దేశ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, టి.బాలనరసయ్య, విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హంపీ హాస్టల్ ప్రారంభం

జెఎన్‌టియులోని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హంపీ హాస్టల్‌ను విసి రంగజనార్ధన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంపీ హాస్టల్‌ను ప్రారంభించడం వల్ల విద్యార్థులు చదువుకోవడానికి అనుకూలంగా ఉందన్నారు.

హాస్టళ్ల మేనేజర్‌గా టి.బాలనరసయ్య

జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల హాస్టళ్ల మేనేజర్‌గా టి.బాలనరసయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతను అప్పగించిన విసి జి.రంగజనార్ధన, రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

పల్లె ఉమకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం



పల్లె ఉమకు నివాళులర్పిస్తున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, కుటుంబ సభ్యులు

మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమకు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఉమా వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం అనంతపురంలోని ఉమా ఘాట్ వద్ద మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి, తనయుడు, బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె కిషోర్, కోడలు పల్లె సింధూర, కుటుంబ సభ్యులు నివాళులఅర్పించారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ పల్లె ఉమ తన జీవితంలోకి రావటం అదృష్టమన్నారు. తన విజయం వెనక పల్లె ఉమ కృషి ఎనలేనిదన్నారు. తాను భౌతికంగా లేనప్పటికీ తనలో ఉందన్నారు. జిల్లాలో ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యను అందించిన విద్యాదాత ఉమ అన్నారు. తాను రాజకీయాల్లోకి వెళ్లి ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించిందన్నారు. తను లేని లోటు పూడ్చలేనిదని కంటతడి పెట్టారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి, హనుమంతరాయచౌదరి, ఈరన్న, టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్.రాజు, రాష్ట్ర కార్యదర్శి గడ్డం సుబ్రమణ్యం, టిడిపి నాయకులు ఎల్.నారాయణచౌదరి, అంబికా లక్ష్మీనారాయణ, గాండ్ల విశాలాక్షి, ఉన్నం మారుతీచౌదరి, సాకే గంపన్న , మాజీ జెడ్‌పీటీసీ వేణుగోపాల్, సిసిఐ నాయకులు వేమయ్యయాదవ్, జాఫర్, ఎస్‌కెయూ ఉప కులపతి మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, విశ్రాంత ఆచార్యులు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీబాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పీవీకేకేఐటీ, శ్రీకృష్ణ దేవరాయ వ్యవసాయ, ఉద్యాన కళాశాలలు, డిగ్రీ, పీజీ కళాశాలలు, జిల్లావ్యాప్తంగా ఆసుపత్రులలో బ్రెడ్లు, పండ్లు, అన్నదానాలు, రక్తదానాలు చేశారు. వృద్ధాశ్రమాల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సింధూరారెడ్డి, కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, పీవీకేకే ఐటీ డీన్ వై.సంతోష్‌కుమార్‌రెడ్డి, బాలాజీ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాళ్ళు, సుబ్బారావు, మన్మదేశ్వరరెడ్డి, బాలాజీ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : విద్యాసంస్థల ద్వారా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాలాజీ విద్యాసంస్థల మాజీ కరస్పాండెంట్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సతీమణి పల్లె ఉమ ఎంతో కృషి చేశారని శ్రీసాయి డిగ్రీ కళాశాల క్యాంపస్ సీఈఓ ఎ.శ్రీరాములు కొనియాడారు. బుధవారం పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాల ఆవరణలో ఉమ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే గుంతకల్లులోని అనురాగ వృద్ధాశ్రమంలో నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, పిఆర్‌ఆర్ ఎంబిఏ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసన్నకుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి : మాజీ ఎమ్మెల్యే విశ్వ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సూచించారు. బుధవారం విడపనకల్లు మండల పరిధిలోని ఉండబండ వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో పాల్తూరు, హావలిగి గ్రామాల్లోని సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సచివాలయాల పరిధిలో రూ.కోటి మంజూరైనట్లు తెలిపారు. ఆయా నిధులతో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పవతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, ఎంపిడిఒ శ్రీనివాసులు, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు, ఎంపిటిసిలు సచివాలయ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథస్వామి కళ్యాణం

గుత్తి : మండలంలోని జక్కలచెరువు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి కళ్యాణోత్సవం బుధవారం కమనీయంగా సాగింది. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం మండపంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా శ్రావణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించే కళ్యాణోత్సవానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అర్చకులు పలకూరి రవికుమార్, విజయ్, రఘు, ఉదయ్, చేతన్, నవీన్, నిఖిల్ లు వేకువ జామున నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరంఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించా రు. తర్వాత అన్నదానం నిర్వహించారు. రాత్రి ఆలయ ఆవరణలో భజన పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో బొలికొండ రంగనాథ స్వామి ఆలయ కార్య నిర్వహణ అధికారి వి.దేవదాసు, ఆలయ కమిటీ ఛైర్మన్ వేల్పుల సోమశేఖర్‌యాదవ్, సర్పంచి సుహాసిని, మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, మాజీ ఎంపిటిసి రాజన్న, వైసిపి నాయకులు ఇబ్రహీం, షఫీ, దేవదాయ శాఖ సిబ్బంది రామకృష్ణ, బాలమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాలు పరిశీలన

ఆత్మకూరు : మండలంలోని తలుపూరు గ్రామంలో రైతులు సాగు చేసిన పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వ రమ్మ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వర్షాధారం కింద వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, తదితర పంటలు వాడు దశకు చేరుకున్నా యన్నారు. కావున రైతులు పొటాషియం నైట్రేట్ (13:00:45) ఏడ గ్రా లేదా (19:19:19) మూడు 19 ఎరువు లేదా యూరియా ఏ 10 గ్రా చొప్పున లీటరు నీటికి కలిపి వారంరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే కంది, ఆముదం పంటలో ఎక్కువ సార్లు అంతరకృషి చేయడం ద్వారా కలుపు నివారణతోపాటు నేలకు ఆచ్ఛాదన కల్పించి నేలలో తేమ శాతాన్ని రక్షించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎడిఎ రవి, మండల వ్యవసాయ అధికారి జి.సుచరిత, ఎఇఒ సుజిత, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

యాడికిని కరువు మండలంగా ప్రకటించాలి

యాడికి : మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశా రు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలో నేటికీ సుమారు పది వేల ఎకరాలు బీడు భూములుగా ఉన్నాయన్నారు. ఖరీఫ్ ప్రా రంభంలో అరకొర వర్షా లతో వేసుకున్న పంటలు ఎండు దశ కు చేరుకున్నాయన్నారు. కావున ప్రభుత్వం స్పందించి మండ లాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

వెలిగొండ రహదారి పనుల పరిశీలన

ఉరవకొండ : ఉరవకొండ నుంచి వెలిగొండకు వెళ్లే రహదారి పనులను వైస్ ఎంపిపి నరసింహులు, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, వైసిపి నాయకులు ఆంజనేయులును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాట్లాడుతూ ఉరవకొండ నుంచి వెలుగొండకు వెళ్లే రహదారి శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికుల వినతి మేరకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో వెంటనే ఆయన స్పందించి రోడ్డు నిర్మాణానికి గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.1.85 కోట్లు విడుదల చేసి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలోనే పనులన్నింటినీ పూర్తి చేసి వెలుగొండ ప్రజలకు ఇబ్బందులను తొలగించనున్నట్లు తెలిపారు.

ప్రజాసేవకు అవకాశం కల్పించడం సంతోషం

ఉరవకొండ : ఎల్లారెడ్డిగారి భీమిరెడ్డి కుమారులైన ఐదుగురు సోదరులకు ప్రజాసేవ చేసేందుకు అవకాశం కల్పించిన సిఎం జగన్‌కు ఎల్లప్పుడూ కృతజ్ఞులై ఉంటామని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సోదరుల్లో గుంతకల్లు ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డి, ఆదోని ఎమ్మెల్యేగా వై.సాయిప్రసాద్‌రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా శాసనమండలి సభ్యునిగా తనకు, తమ సోదరుల్లో పెద్దవాడైన సీతారామిరెడ్డికి టిటిడి పాలకమండలి సభ్యునిగా అవకాశం కల్పించి ప్రజాసేవ చేయడానికి అవకాశం కల్పించారన్నారు. తమ కుటుంబం పట్ల ఇంతటి ప్రేమను చూపుతున్న సిఎం జగన్ అడుగుజాడల్లో నడుస్తామన్నారు.

సోదర ప్రేమకు చిహ్నం రక్షాబంధన్

ప్రజాశక్తి-అనంతపురం

విశ్వ ప్రేమకు చిహ్నం రక్షాబంధన్ అని శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న ఏటీపీ-8లో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం దుష్టశక్తులను పారదోలడంతోపాటు మనం చేపట్టే కార్యాలు విజయవంతంగా ముగించడానికి రక్షాబంధన్ నిర్వహించుకునే వారన్నారు. అనంతర కాలంలో సోదర, సోదరీ ప్రేమకు ప్రత్యేకంగా మారిందన్నారు. ఈ పండగ కుటుంబ విలువలు, మానవ సంబంధాలను పరిపుష్టి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నేత్రావతి, అరుణ్, కిరణ్, సి.బ్యాచ్ ఇన్‌ఛార్జి గంగాధర్, కోఆర్డినేటర్ తిరుమలేశ్వర్, ప్రైమరీ ఇన్‌ఛార్జి దేవీకృప, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని సోదర, సోదరీమణులు రాఖీ పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా విప్ కాపు రామచంద్రారెడ్డికి అనేకమంది మహిళలు రాఖీలు కట్టారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం నిర్వాహకులు బి.కె యోగేశ్వరి, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళు శిల్ప, ఇతర సభ్యులకు రాఖీలు కట్టారు. అలాగే సరస్వతి విద్యా మందిరం పాఠశాలలో కమిటీ అధ్యక్షులు జనార్ధన నేతృత్వంలో విద్యార్థులు, రాఖీ పండుగ జరుపుకున్నారు. పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, అధికారులు, వాణిజ్య సంస్థలు ఆటో, మోటార్ బైక్ డ్రైవర్లకు రాఖీలు కట్టారు.



ఎమ్మెల్యే అనంతకు రాఖీ కడుతున్న సాయి ట్రస్టు మాతృ మండలి సభ్యులు



శ్రీచైతన్య పాఠశాలలో రాఖీ కడుతున్న చిన్నారులు

అనంతపురం : సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్షాబంధన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొని ట్రస్టు బృందం సభ్యురాళ్లతో రాఖీ కట్టించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోదర, సోదరీమణుల పవిత్రతను గుర్తు చేసేదే రాఖీ పండుగ అన్నారు. ఈ కార్యక్రమంలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్, సభ్యులు రాఘవ, నారాయణ, మాతృ మండలి సభ్యులు లక్ష్మి, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ హాల్‌లో ఆర్‌పిలతో సమావేశమా?

టిడిపి వార్డు సభ్యురాలు ప్రశాంతి

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు జరిగే హాల్లో.. వార్డు సభ్యులు కూర్చునే కుర్చీల్లో రీసోర్స్‌పర్సన్లతో సమావేశం నిర్వహించడంలో అర్థం ఏంటో చెప్పాలని టిడిపి వార్డు సభ్యురాలు ప్రశాంతి నిలదీశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప అధ్యక్షతన బుధవారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల మున్సిపల్ కౌన్సిల్ హాలులో మెప్మా రీసోర్స్‌పర్సన్ల సమావేశం నిర్వహించి కౌన్సిల్ సభ్యులు కూర్చున్న చోట ఎలా కూర్చోనిచ్చారని ప్రశ్నించారు. ఇందుకు కమిషనర్ దివాకర్‌రెడ్డి సమాధానం ఇస్తూ మెప్మా డైరెక్టర్, మున్సిపల్ కౌన్సిల్ ఎక్స్ అఫీషియల్ సభ్యులు, స్థానిక శాసనసభ్యులు కౌన్సిల్ హాల్‌లో మెప్మా పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారన్నారు. ఈ సమావేశంలోనే రీసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారని వివరించారు. మరో వార్డు సభ్యులు బండి అజయ్ మాట్లాడుతూ రాబోయే రెండేళ్లకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులను ముందుగానే విద్యుత్ సంస్థకు చెల్లించే అవసరం ఏముందని ప్రశ్నించారు. బకాయిలు చెల్లించకపోతే సర్‌ఛార్జి భారం పడుతుందని కమిషనర్ తెలిపారు. వీటితోపాటు అనేక సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలకూ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యులు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నార్పల : ఉపాధి కల్పనలో భాగంగా నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డేవిడ్, ఎపిఎస్ఎస్‌డిసి జిల్లా నైపుణ్యా అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి) ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పిఎంకెవివై సెంటర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. చదువుకుని ఖాళీగా ఉన్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్.90100 39901, 97049 16678ను సంప్రదించాలని కోరారు.

ఏపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

శింగనమల : ఏపిటిఎఫ్ మండల నూతన కమిటీ బుధవారం ఏకగ్రీవంగా ఏర్పాటు చేసినట్లు మండల గౌరవాధ్యక్షులు రాజేంద్రకుమార్ తెలిపారు. గౌరవాధ్యక్షులుగా రాజేంద్రకుమార్, మండల అధ్యక్షులుగా శ్రీనివాస్‌మూర్తి, ప్రధాన కార్యదర్శిగా కె.రామమూర్తి, కార్యవర్గ సభ్యులుగా సూర్యనారాయణ, డి.బాబు, వన్నూరప్ప, సత్యవతిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నరసింహరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల బహిరంగ వేలం

అనంతపురం క్రైం : అనంతపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) స్టేషన్ పరిధిలోని వివిధ ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన మూడు వాహనాలను గురువారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ ఆర్.రవిచంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సెబ్‌స్టేషన్ ఆవరణలో సూపరింటెండెంట్ సమక్షంలో వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.3 వేలు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

వైసిపి నేత మధుసూదన్‌రెడ్డి

సొంత నిధులతో తాగునీటి సరఫరా

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న తాగునీటి తాత్కాలిక పరిష్కారం కోసం వైసిపి జిల్లా నాయకులు, మణికంఠ మెటల్ స్టోన్ క్రషర్స్ అధినేత కప్పలబండ మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్ కప్పలబండ సుచరిత చర్యలు చేపట్టారు. ఐదు నెలల వేతనాలు రాకపోవటంతో శ్రీ సత్యసాయి మంచినీటి ప్రాజెక్టు కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో మున్సిపాలిటీ పరిధిలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడింది. దీంతో ప్రజలు తాగునీటి కష్టాలను చూసిన మధు దంపతులు పట్టణ శివారులోని అనంతపురం రోడ్డు పక్కన ఉన్న తమ తోటలోని మంచినీరు బోరు నుంచి 25 వేలు లీటర్ల సామర్థ్యం ఉన్న సొంత వాటర్ ట్యాంకర్ల ద్వారా ప్రజల కోసం తాగునీరు సరఫరా చేస్తున్నారు. అలాగే మున్సిపాలిటీ అధికారులు ఏర్పాటు చేసిన ట్యాంకర్లకు వారి తోటలోని మంచినీరు బోరు నుంచి తాగునీరును వదులుతున్నారు. ఆ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న భారీ సంపును నింపుతున్నారు. అక్కడి నుంచి 10, 11, 12, 13, 14, 15, 21, 22, వార్డుల్లో 54 పైపులైన్ల ద్వారా తాగునీరు, 16, 20వ వార్డుల్లో కొంత భాగం కోళాయిలకు మున్సిపల్ సిబ్బంది ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నారు. శ్రీసత్యసాయి మంచినీటి ప్రాజెక్టు కార్మికులు సమ్మె విరమించేంత వరకూ తాము ట్యాంకర్ల ద్వారా తాగునీటిని తరలిస్తామని కె.మధుసూదన్‌రెడ్డి తెలిపాన్నారు. వైసీపీ జిల్లా నాయకులు కె.మధుసూదన్ రెడ్డి ఆయన సతీమణి కౌన్సిలర్ కె.సుచరిత ల సేవా దృక్పథానికి పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ట్యాంకర్‌కు నీరు నింపుతున్న దృశ్యం

జీవరాసుల మనుగడకు కృషి

ఉరవకొండ : సృష్టిలో జీవరాశుల మనగడకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిహెచ్ఆర్‌సి జాతీయ వైస్ ప్రెసిడెంట్, పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్‌నాయుడు పిలుపునిచ్చారు. జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేష్ సహకారంతో పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల కళాశాలతోపాటు, మహాత్మా డిగ్రీ కళాశాల, హై స్కూల్‌లో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర, బాలికల కళాశాల ప్రిన్సిపల్ మమతా, ఎన్ఎస్-ఎస్ కోఆర్డినేటర్ ఖాదర్, మహాత్మా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బసవరాజు, మహాత్మా విద్యాసంస్థల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ప్రసాద్, ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమప్ప, ఎస్‌కెజిఎస్ హైస్కూల్ హెచ్ఎం వీరన్న, సెంట్రల్ హైస్కూల్ హెచ్ఎం రాజేశ్వరి, జైకిసాన్ ఫౌండేషన్ ప్రతినిధులు, సురేష్, సురేంద్ర, కుళ్లాయి, పురుషోత్తం, శర్మాస్, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న జిహెచ్ఆర్‌సి జాతీయ వైస్ ప్రెసిడెంట్, పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్‌నాయుడు